క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



ఉషారాణిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మొర్రి రామకృష్ణ భార్య ఉషారాణి అనారోగ్యంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. సంబంధిత వైద్యులతో మాట్లాడారు. ఆమెతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న స్ఫూర్తి టీమ్ సభ్యులు

బూర్జ: చెడు వ్యసనాలకు బానిస అయితే జీవితాలు నాశనం అవుతాయని, ప్రతిఒక్కరూ మంచి మార్గంలో నడచుకోవాలని స్ఫూర్తి టీమ్ సభ్యులు తెలియజేశారు. మండలంలో గల బూర్జ జెడ్పీ హైస్కూల్, పాలవలస, కె.కె.రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఎస్పీ జి.ఆర్ రాధిక ఆదేశాల మేరకు ఎస్‌ఐ బి.అశోక్ బాబు, ప్రిన్సిపాల్ ఎస్.తవిటినాయుడు ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్ఫూర్తి టీమ్ సభ్యులు మాట్లాడుతూ పోక్సో, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, లైంగిక దాడులు, మీ భద్రత–మీ చేతుల్లో తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

విత్తన గుళికల తయారీపై అవగాహన



విత్తన గుళికల తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: విత్తన గుళికలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ రీసోర్స్ పర్సన్ కె.రజని అన్నారు. కుశాలపురంలో విత్తన గుళికలు తయారీపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విత్తనాలను గుళికలుగా మార్చి విత్తటం వల్ల సాగులో మంచి ఫలితాలు వస్తాయన్నారు. భీజామృతం, బంక మట్టి పొడి, ఘనజీవామృతం, బూడిదలో విత్తనాలు కలపటం వల్ల గుళికలు సిద్ధం అవుతాయన్నారు. విత్తనాల నిల్వ, నాటిన తరువాత మొలక శాతం, మొక్కలు ఎదుగుదలకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందన్నారు. సిబ్బంది పూర్ణ, అమ్మాజి, చిన్నారావు పాల్గొన్నారు.

మహిళల భద్రత.. మా బాధ్యత



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాతపట్నం: మహిళలకు భద్రత కల్పించడమే మా బాధ్యత అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని సీఐ ఎం.వినోద్‌బాబు అన్నారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో రూపొందించిన స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా పాతపట్నం బస్టాండ్ వద్ద గురువారం రాత్రి కళా రూపాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు, మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలకు గౌరవించడం మన బాధ్యత అన్నారు. ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు, ఏఎస్‌ఐలు శ్రీనివాసరావు, సింహాచలం, పోలీస్‌లు, సచివాలయ మహిళా పోలీస్‌లు పాల్గొన్నారు.

కల్లేపల్లికి మదర్ థెరీసా సేవారత్న అవార్డు



కల్పనకు అవార్డుతో సత్కరిస్తున్న ఆదర్శ్ సొసైటీ నిర్వాహకులు

సరుబుజ్జిలి: మండలంలోని నందికొండ కాలనీకి చెందిన సిక్కోలు సేవా సమితి అధ్యక్షురాలు కల్లేపల్లి కల్పనకు గురువారం మదర్ థెరీసా సేవారత్న అవార్డు లభించింది. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆదర్శ్ సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రొక్కల నాగబాబూజీ అవార్డు అందించారు. పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమెకు అవార్డు అందించినట్లు సొసైటీ నిర్వాహకులు తెలిపారు. ఆమెకు అవార్డు దక్కడం పట్ల జిల్లా క్రైస్తవ మ్యారేజీ రిజిస్ట్రార్ ప్రత్తిపాటి ప్రసాదరావు అభినందనలు తెలిపారు.

పశువులు జాగ్రత్త!



గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్న వైద్యులు

- ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు
- ముందే మేలుకుంటే వ్యాధి దరిచేరదు

జలుమూరు: పశువులకు తరచూ గాలికుంటు వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి చిన్నదే అయినప్పటికీ.. తీవ్రం అయితే చాలు భారీ నష్టం ఏర్పడుతుంది. ఒక్కో సందర్భంలో ఈ వ్యాధి బారినపడిన పశువులు మృతి చెందడం కూడా జరుగుతుంది. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు గాలికుంటు వ్యాధి టీకాలు వేసేందుకు చర్యలు తీసుకుంది. దగ్గరలో ఉండే పశువుల ఆస్పత్రులు, గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి ఈ టీకాలు ప్రస్తుతం వేస్తున్నారు. టెక్కలి డివిజన్ పరిధిలోని 16 మండలాల్లో గల 2.26 లక్షలు పశువులకు 261 సిబ్బంది టీకాలు వేసేందుకు లక్ష్యం ఏర్పర్చుకున్నారు. ఈ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను టెక్కలి డివిజన్ పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ వి.జయరాజు వివరించారు.

వ్యాధి లక్షణాలు..

- ముందుగా పశువు నోటి నుంచి చొంగ కారిడం ప్రారంభం అవుతుంది. ఇదే సమయంలో పక్క వాటికి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వ్యాధి సోకిన వాటికి 104 డిగ్రీల నుంచి 105 డిగ్రీల వరకు జ్వరం వస్తుంది.
- ఆహారం సరిగ్గా తీసుకోవు.
- నోటిలో, కాలి గిట్టల్లో పుండ్లు ఏర్పడతాయి.
- నెల రోజుల వయస్సున్న దూడలు, ఈవ్యాధి ఉన్న పశువులు పాలు తాగితే వ్యాధి సోకి మరణిస్తాయి.
- ఈ వ్యాధి సోకిన పశువులు పునరుత్పత్తి సమస్యలతో బాధపడతాయి.
- ఈ వ్యాధి సోకిన పశువులు ఎండలో ఎక్కువ సేపు ఉండలేవు.
- దుక్కిదున్నే పశువులు కాళ్ల మట్టలు కదిలేపోవడం వల్ల పనికి పనికిరావు.



డీడీ వి.జయరాజు

సుధాకర్ విజయం చారిత్రక అవసరం

- స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆమదాలవలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఉన్న సీతంరాజు సుధాకర్ విజయం చారిత్రక అవసరమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని స్పీకర్ క్యాంపు కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ విశాఖలో కార్యనిర్వాహక రాజధాని ఏర్పాటైతే రాష్ట్ర దశ, దిశ మారే అవకాశాలు ఉంటాయన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుకు స్వస్తి పలికే అవకాశం ఉంటుందని, దీన్ని గుర్తెరిగి పట్టభద్ర ఓటర్లు సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో నిర్వహించాల్సిన విధులపై నియోజకవర్గ పరిశీలకులు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ క్యాడర్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ట



ఎమ్మెల్యే రెడ్డి శాంతిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీ (పాడలి)లో వనమహాలక్ష్మీదేవి ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. ఆలయ సంప్రదాయ ప్రకారం ఎమ్మెల్యేకు ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు సర్పంచ్ పెదకోట సాదుబాబు, కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ నెల మూడో నుంచి జరుగుతున్న ఆలయ ప్రతిష్ట కార్యక్రమాల్లో భాగంగా చివర రోజు గురువారం వనమహాలక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్టను వైభవోపేతంగా నిర్వహించారు. దేవిని ఇలవేల్పుగా కొలుస్తున్న పాడలి, దిమిలి, విస్సల గ్రామాలతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తుల సహకారంతో అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. జానపద, పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం



ఎల్.ఎన్.పేట: మాట్లాడుతున్న జెడ్పీటీసీ త్రినాథులు, వ్యవసాయ సిబ్బంది



కొత్తూరు: మహిళా రైతులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏడీఏ బాబాజీ

హిరమండలం: నవధాన్యాల సాగు భూసారాన్ని పెంచే సంజీవని అని డివిజన్ యాంకర్ బాబాజీ అన్నారు. మండలంలోని పిండ్రువాడలో నవధాన్యాల సాగుపై డ్వాక్రా మహిళా సంఘ సభ్యులు, రైతులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో భూమి పూర్తిగా తన సారాన్ని కోల్పోయిందని, తిరిగి భూమి సారవంతం కావాలంటే మళ్లీ భూమిలో ఆర్గానిక్ కంటెంట్ పెంచాలన్నారు. రసాయన ఎరువల వాడకం తగ్గించి నవధాన్యాల సాగు తప్పనిసరిగా చేయాలని వివరించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఏ శ్రీకాంత్, ఎంటీ సంజీవ్, ఎల్.రామరావు, సీఐఆర్పీ వెంకటరమణ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఆదా

ఎల్.ఎన్.పేట: ప్రకృతి వ్యవసాయ సాగు విధానంలో పంటలు పండించటం వల్ల పెట్టుబడి ఆదా అవుతుందని జెడ్పీటీసీ కిలారి త్రినాథరావు అన్నారు. మండలంలోని యంబరాం గ్రామంలో సర్పంచ్ వెలమల గోవిందరావు అధ్యక్షతన గురువారం జరిగిన ప్రకృతి వ్యవసాయ సాగు అవగాహన సదస్సులో జెడ్పీటీసీ మాట్లాడారు. రైతులకు సహజ సిద్ధంగా లభించే ఆవుపేడ, గో మూత్రం, జిల్లేడు ఆకులు వంటి వాటితో ఎరువులు, జీవామృతం, అగ్నిఆస్త్రం వంటి మందులను తయారు చేసుకోవచ్చన్నారు. రసాయన ఎరువులు, పురుగుల మందుల ఖర్చు తగ్గుతుందన్నారు. భూసారాన్ని కాపాడుకునేందుకు నవధాన్యాలు సాగు చేసి భూమిలో కలియ దున్నాలని తెలిపారు. రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ మండల రీసోర్స్ పర్సన్ మెట్ట పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం పెంచాలి

కొత్తూరు: రానున్న ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం పెంచాలని మహిళ రైతులకు ప్రకృతి వ్యవసాయం ఏడీఏ బాబాజీ సూచించారు. కర్లెమ్మ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పీఎండీఎస్, విత్తన గుళికుల తయారీ, వాటి వినియోగంపై ఏడీఏ, ఎంటీ సూర్యనారాయణ అవగాహన కల్పించారు. ప్రృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం పెంచడంతోపాటు అన్ని రకాల కషాయాలు, ద్రావణాలు తయారీ నేర్చుకుంటామని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల వివరాల నమోదు



కార్మికుల వివరాలు నమోదు చేస్తున్న గ్రామ సచివాలయ సిబ్బంది

ఎల్.ఎన్.పేట: ప్రధాన మంత్రి జీవన్ యోజనా (పీఎంజెవై) బీమా పథకం కింద రెండు గ్రామాల్లో 133 మంది కార్మికుల వివరాలు నమోదు చేసినట్లు ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ గురువారం తెలిపారు. కవిటిలో 68 మంది, కుశమలపాడులో 65 మంది కార్మికులు వారి వివరాలను నమోదు చేసుకున్నారన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లను సంప్రదించి కార్మికులంతా వారి వివరాలను నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. కరకవలస గ్రామ సచివాలయ కార్యదర్శి మహ్మద్ ముజీబ్, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు



గాయపడిన ఉపాధ్యాయుడు

బూర్జ: మండలంలోని అన్నంపేట రహదారి కూడలి వద్ద బైక్ అదుపుతప్పి బోల్తాపడి ఉపాధ్యాయుడు గాయపడ్డారు. ఈ ప్రమాదం గురువారం సాయంత్రం జరిగింది. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం తెలియజేయడంతో సిబ్బంది వచ్చి పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. సీతంపేట మండలం గడపవలస గ్రామానికి చెందిన కె.బాలరాజు మర్రిగూడలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ.. వార్డెన్‌గా బాధ్యతలు తీసుకున్నారు. విధులు పూర్తిచేసి తన ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా.. మార్గమధ్యలో బైక్ బోల్తాపడటంతో స్వల్ప గాయాలయ్యాయని 108 పైలట్ శ్రీను తెలిపారు.

రూ.5 లక్షలతో డంపింగ్ యార్డ్ అభివృద్ధి



డంపింగ్ యార్డ్ వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: మేజరు పంచాయతీకి చెందిన డంపింగ్ యార్డ్‌ను రూ.5 లక్షల పంచాయతీ నిధులతో అభివృద్ధి చేసినట్లు సర్పంచ్ బూరల్లి శంకర్ గురువారం తెలిపారు. డంపింగ్ యార్డు చుట్టూ జంగిల్ తొలగించి మట్టి రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. మరో ఐదేళ్ల వరకు చెత్త వేసేందుకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. డంపింగ్ యార్డ్‌లో చెత్తకుప్పలకు మంటలు అంటుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నేడు డీవార్మింగ్ డేపై అవగాహన

సరుబుజ్జిలి: నేషనల్ డీవార్మింగ్‌డే సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్ గురువారం ప్రకటనలో వెల్లడించారు. ఈ సమావేశానికి వైద్యాధికారి, ఎంఈఓ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



నరసన్నపేట: ఉర్లాంలో గర్భిణులకు సూచనలిస్తున్న డాక్టర్ సుజాత



హిరమండలం: పీహెచ్‌సీలో సత్యసాయిసేవా ట్రస్టు ఆధ్వర్యంలో గర్భిణులకు ఏర్పాటు చేసిన భోజనాలు



ఆమదాలవలస రూరల్: గర్భిణులకు భోజనాలు ఏర్పాటు చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు



పాతపట్నం: సీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: మండల కేంద్రంలోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రితోపాటు మాకివలస, ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ యోజన పథకంలో భాగంగా గురువారం 65 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేపట్టారు. వంద పడకల ఆస్పత్రిలో 30 మందికి, ఉర్లాం పీహెచ్‌సీలో 27 మందికి, మాకివలస పీహెచ్‌సీలో 8 మందికి తనిఖీలు చేసి, రక్త పరీక్షలు చేపట్టారు. రక్త హీనతతో ఉన్నవారిని గుర్తించి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వైద్యులు తెలిపారు.

హిరమండలం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని 68 మంది గర్భిణులకు వైద్యాధికారులు సి.హెచ్.సాయి గీత, ఫారుక్ హుస్సెన్ వైద్య తనిఖీలు నిర్వహించారు. పీఎంఎంఎస్‌వై పథకంలో భాగంగా గర్భిణులకు జెమ్స్ ఆస్పత్రి కి చెందిన రేడియాలిజిస్టు వేదాంత్ సహకారంతో అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లు చేపట్టారు. పౌష్టికాహారం ఆవశ్యకత, ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు అవసరమైన వారందరికీ ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనాలు ఏర్పాటు చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమదాలవలస రూరల్: అక్కులపేట సత్యసాయి సేవా సమితి చేస్తున్న సేవలు అభినందనీయమని అక్కులపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు బొడ్డేపల్లి వసంత, కూన మీనాకుమారి అన్నారు. అక్కులపేట పీహెచ్‌సీలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ప్రారంభించారు. ప్రతి నెలా 9వ తేదీన పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ పరీక్షలకు హాజరైన గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు ప్రతి నెలా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నారన్నారు. సమితి కన్వీనర్ సూర్యారావు, ఎం.జనార్దనరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నం: పాతపట్నం సీహెచ్‌సీ ఆస్పత్రిలో గర్భిణులకు నవజీవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని వైద్యురాలు జి.అనిత పంపిణీ చేశారు. ఈ వైద్యురాలు మాట్లాతూ గర్భిణులకు ట్రస్ట్ అందజేస్తున్న పౌష్టిక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కరోనా నేపథ్యంలో నిలిపివేశామని, మళ్లీ ఇప్పుడు ప్రారంభించామని ట్రస్ట్ నిర్వాహకులు నరిసింహ రెడ్డి తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరంతర అభ్యసనతో ఉత్తమ ఫలితాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ మాధవరావు

జలుమూరు: నిరంతర అభ్యసనతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ఎంఈఓ బి.మాధవరావు అన్నారు. ఈదులువలస ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను గురువారం పరిశీలించారు. వర్కు బుక్స్, ఆయా పాఠ్యాంశాల్లో నేర్చుకున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయురాలు భవానీ, సీఆర్పీ ఎర్రన్న పాల్గొన్నారు.

సీతంరాజును ఆశీర్వదించండి



ఆమదాలవలస: కొర్లకోటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్



నరసన్నపేట: శార్వాణీ విద్యాలయంలో ఉపాధ్యాయులకు ప్రచార పత్రాలను అందజేసి ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు 1వ ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టాలన్నారు. విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రాంత వాసులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ఓటర్ పేరు, పోలింగ్ కేంద్రం అడ్రస్, పోలింగ్ బూత్ నంబర్ల వివరాలతో కూడిన కరపత్రాలను ఓటర్లకు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: పట్టణంలో ప్రచారం చేస్తున్న స్పీకర్ సతీమణి, తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం



బూర్జ: మండల కేంద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్



ఆమదాలవలస రూరల్: పెద్ద జొన్నవలసలో ప్రచారం నిర్వహిస్తున్న తమ్మినేని శ్రీరామ్మూర్తి, పార్టీ నాయకులు



హిరమండలం: మండల కేంద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మెళియాపుట్టి: రామచంద్రాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సారవకోట: సింగంవలసలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పోలాకి: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పార్టీ నాయకులు



పొందూరు: తోలాపిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాతపట్నం: ఓటర్లకు కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: ఓండ్రుజోలలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు